క్లుప్తంగా

విద్యార్థులు రోజూ పేపర్ చదవాలి



గన్నవరం రూరల్: ప్రతి రోజూ విద్యార్థులు న్యూస్ పేపర్‌ను తప్పక చదవాలని ముస్తాబాద శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.జ్యోతికుమారి పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్‌లో భాగంగా గురువారం లైబ్రరీలో విద్యార్థులకు న్యూస్ పేపర్, కథల పుస్తకాలు చదివించటం, మ్యూజికల్ చైర్స్, చెస్ ఆడించారు.

మజ్జిగ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవి ఎండ తీవ్రత అధికం కావడంతో పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో గురువారం హనుమాన్‌జంక్షన్‌లో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. జంక్షన్ ప్రధాన కూడలిలో రామాలయం వద్ద సత్య సాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరంలో మజ్జిగ పంపిణీ జరిగింది. సుమారు 1500 మందికి మజ్జిగ పంపిణీ చేసినట్లు సమితి అధ్యక్షుడు బెక్కం వెంకటేశ్వరరావు తెలిపారు. స్థానిక విజయవాడరోడ్డులోని పోలీస్‌స్టేషన్ సమీపంలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద పాదచారులు, ప్రయాణీకులకు మజ్జిగ అందించారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి



ఉయ్యూరు: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అటవీశాఖ మచిలీపట్నం అధికారులు ఎం.వెంకటేశ్వరరావు, ఎం.శ్రీనివాసరావు సూచించారు. వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా ఉయ్యూరు శాఖా గ్రంథాలయాన్ని గురువారం సందర్శించారు. మొక్కలు నాటడం, సంరక్షించడంతో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్లాస్టిక్‌ను నిషేధించాలని సూచించారు. రిసోర్స్ పర్సన్ ఎం.వెంకటసాయి గణితంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమాలను గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

ఉయ్యూరు బస్టాండ్‌లో చలివేంద్రం ప్రారంభం



ఉయ్యూరు: దిరిశం ప్రభాకర్‌రావు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉయ్యూరు బస్టాండు ప్రాంగణంలో చలివేంద్రం గురువారం ప్రారంభించారు. దిరిశం ప్రభాకర్‌రావు వర్ధంతి సందర్భంగా వారి కుమారులు సుధాకరరావు పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని డిపో మేనేజరు కేఎస్‌ఆర్‌కే ప్రసాద్ ప్రారంభించి మజ్జిగను ప్రయాణికులకు అందించారు. తొలుత ప్రభాకరరావు చిత్రపటానికి ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దిరిశం సోదరులు రత్నాకర్, ప్రేమాకర్, దళిత నాయకులు పినమాల నాగకుమార్, ఎంజీ రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీదుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. ప్రతి నెలా షష్ఠి రోజున ఆలయ అర్చకులతో నిర్వహించే కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. కార్యక్రమంలో దుర్గగుడి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి భ్రమరాంబ, ట్రస్ట్ సభ్యులు కట్టా సత్తెయ్య పాల్గొన్నారు. షష్ఠి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి సుబ్రహ్మణ్య స్వామి కల్యాణోత్సవాన్ని తిలకించారు.

దాడి ఘటనపై కేసు

కంకిపాడు: దాడి ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల మేరకు... మండలంలోని నెప్పల్లి గ్రామానికి చెందిన జె.సతీష్ ఈనెల 20న పనిమీద షాప్‌నకు వెళ్తుండగా అప్పికట్ల వంశీ అడ్డగించి అకారణంగా తన్నాడు. స్థానికులు సర్దిచెప్పగా ఇంటికి వెళ్తుండగా మోటార్ సైకిల్‌పై వచ్చి సతీష్‌ను అడ్డగించి తీవ్రంగా కొట్టాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉయ్యూరు: నిస్వార్థ సేవకులు వలంటీర్లు అని ఎమ్మెల్యే పార్థసారథి అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గురువారం వలంటీర్ల సత్కార కార్యక్రమం నిర్వహించారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్రగా ఎంపికైన వలంటీర్లను సత్కరించి ప్రోత్సాహకాలను అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వలంటీర్లు సమర్థంగా సేవలు అందిస్తున్నారని కొనియాడారు. వలంటీరు వ్యవస్థ ద్వారా అర్హులకు పథకాలు చేరువ చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రాజకీయాలకు తావులేకుండా పథకాలను అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానిదేనన్నారు. వలంటీర్లు ప్రతి ఒక్క కుటుంబంతో మమేకమై ప్రభుత్వ సేవలను సమర్థంగా అందించడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి రావడానికి సమర్థంగా పని చేయాలని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు నీచరాజకీయాలు చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రతిపక్షాలకు ప్రజాక్షేత్రంలో భంగపాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని), వైస్ చైర్మన్‌లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసాబేగం, ప్రభుత్వా సుపత్రి చైర్మన్ జంపాన కొండలరావు, మండల పార్టీ అధ్యక్షుడు దాసే రవి, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

గన్నవరం రూరల్: వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని గొల్లనపల్లి సర్పంచ్ గణపవరపు శాంతి అన్నారు. గురువారం స్థానిక గ్రామ సచివాలయం వద్ద అవార్డులు పొందిన వలంటీర్లను ఆమె సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజలకు వలంటీర్ల వ్యవస్థ నిర్మాణంతో గడప వద్దకే పథకాలను పంపి ప్రజల కష్టాలను తీర్చిందన్నారు. ఈ కృషిలో వలంటీర్ల పాత్ర అనిర్వచనీయమని, అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలు అందించిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డిదని కొనియాడారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి ఎస్.శివనాగరాజు, సచివాలయం కన్వీనర్లు పలగాని శోభనాద్రి, కాట్రు రాజు, పులపాక జ్యోతి, గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ గణపవరపు వెంకయ్య పాల్గొన్నారు.

వారి పాత్ర కీలకం

ఉంగుటూరు: ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులకు అందజేయడంలో వలంటీర్లు కీలక పాత్ర వహిస్తున్నారని ఎంపీపీ వి.సరోజిని అన్నారు. పొట్టిపాడు గ్రామ సచివాలయం ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరై వలంటీర్లను సన్మానించి ప్రసంగించారు. అనంతరం 14మంది వలంటీర్లకు సేవామిత్ర, ఒకరికి సేవా రత్న అవార్డును అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కత్తుల జ్యోతి, ఎంపీడీఓ జీఎస్వీ శేషగిరి రావు, ఈఓపీఆర్‌డీ బాషా, కార్యదర్శి కృపాకుమార్ పాల్గొన్నారు.

అల్లాపురంలో..

గన్నవరం: మండలంలోని అల్లాపురం గ్రామ సచివాలయంలో గురువారం ఉత్తమ సేవలందించిన వలంటీర్లకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ అనగాని రవి, సర్పంచి డొక్కు సాంబశివ వెంకన్నబాబు చేతుల మీదుగా 11 మంది వలంటీర్లను శాలువాలతో సత్కారించి ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ...ఎటువంటి వివక్ష, అవినీతికి తావు లేకుండా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా సేవా భావంతో ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను గౌరవించడం బాధ్యతగా భావించాలని తెలిపారు. ఉప సర్పంచ్ ఆవుటపల్లి శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శి కోటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సురేష్, బాలశౌరి పాల్గొన్నారు.



వలంటీర్లను సత్కరించిన సర్పంచ్ శాంతి, ఎంపీటీసీ సభ్యురాలు నాగరాణి



పొట్టిపాడులో వలంటీర్లను సన్మానించిన ఎంపీపీ



వలంటీర్లను సత్కరించిన ఎంపీపీ, సర్పంచ్

నేడు తాడిగడప, కంకిపాడులో పురస్కారాల అందజేత

పెనమలూరు: తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని వలంటీర్లకు శుక్రవారం ప్రోత్సాహక పురస్కారాలు ఇవ్వనున్నామని కమిషనర్ ఎస్.ప్రకాశరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటలకు కానూరులోని యార్లగడ్డ గ్రాండియర్‌లో కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. తాడిగడప మునిసిపాలటీ పరిధిలో ఐదుగురికి సేవారత్న వచ్చిందని తెలిపారు. కానూరు 1సచివాలయం నుంచి కె.వసంత కోటేశ్వరరావు, కానూరు 2 సచివాలయానికి చెందిన ఎండీ పర్వీన్ సుల్తానా, కానూరు 5 సచివాలయాలనికి చెందిన కె.సువర్ణ, పోరంకి 1 సచివాలయం బాణావత్ తిరుమల, యనమలకుదురు 2 షేక్ అస్మాలకు సేవారత్న అవార్డులు వచ్చాయని వివరించారు. వీరితో పాటు 502 మంది వలంటీర్లకు సేవా మిత్ర అవార్డులు వచ్చాయని, వీరికి ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అవార్డులు ప్రదానం చేస్తానని తెలిపారు.

కంకిపాడు: గ్రామ వలంటీర్లకు వందన సత్కార కార్యక్రమం ఈనెల 26వ తేదీ సాయంత్రం 4 గంటలకు స్థానిక మండల పరిషత్‌కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ దుర్గాప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన వివరాలు తెలుపుతూ మండలంలోని ఇద్దరు వలంటీర్లకు సేవా వజ్ర, ఐదుగురుకి సేవారత్న, 316 మందికి సేవా మిత్ర లభించాయన్నారు.

పాడి పరిశ్రమలో మహిళలు ప్రగతి సాధించాలి

గన్నవరం రూరల్: మహిళలు పాడి పరిశ్రమలో ఉన్నతంగా ఎదగాలని ముస్తాబాద పశు చికిత్సా కేంద్రం డాక్టర్ మేరీ వైడూర్యం సూచించారు. గురువారం గోపవరపుగూడెం గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ నల్లూరు వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జగనన్న పాల వెల్లువ కార్యక్రమంలో మహిళా రైతులు, డ్వాక్రా సంఘాలు పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ డ్వాక్రా మహిళలకు గ్రూపుల ద్వారా గేదెల కొనుగోలుకు లక్ష రూపాయలు రుణ సౌకర్యాన్ని ప్రభుత్వం కలిగించిందని చెప్పారు. జగనన్న పాల వెల్లువ ద్వారా అమూల్ కేంద్రాల్లో పాలు పోయడంతో మంచి ధర లభిస్తుందని, మహిళల ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను వినియోగించుకోవాలని చెప్పారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లిలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 15 ఎకరాల 17 సెంట్ల వ్యవసాయ భూమి కౌలు చేసుకునే హక్కు నిమిత్తం శుక్రవారం టెండర్ కమ్ బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె. లక్ష్మీనారాయణశెట్టి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ఆర్‌ఎస్. నెం.426/1, 2, 3లో ఉన్న ఈ భూములను 2023–24 నుంచి 2025–26 వరకు మూడేళ్ల కాల పరిమితికి కౌలుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు శుక్రవారం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగే బహిరంగ వేలంపాటలో పాల్గొన్నాలని కోరారు.

పరిహారం కోసం ఆందోళన

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం మల్లవల్లిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన ఏపీఐఐసీ పారిశ్రామికవాడ భూనిర్వాసితులు నష్టపరిహారం కోరుతూ గురువారం ఆందోళనకు దిగారు. ఏపీఐఐసీ పారిశ్రామికవాడకు వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నిర్వాసితులకు తక్షణమే పరిహారం మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జనసేన జిల్లా అధికార ప్రతినిధి శివరామకృష్ణ, జిల్లా కార్యదర్శి రవి, జిల్లా సంయుక్త కార్యదర్శి రవివర్మ మద్దతు తెలిపారు.

ఫౌండేషన్ దశ నుంచే నాణ్యమైన విద్యనందించాలి

సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య

సాక్షి, అమరావతి: ఫౌండేషన్ దశ నుంచే విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడం ద్వారా వారిలో సామర్థ్యాలను మెరుగుపర్చాలని సీమ్యాట్ డైరెక్టర్ మస్తానయ్య తెలిపారు. నిడమానూరులో ఆరు రోజుల పాటు నిర్వహించే ఫౌండేషనల్ అభ్యాస శిక్షణా కార్యక్రమానికి గురువారం ముఖ్య అతిథిగా ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చిన్న వయసులోనే విద్యార్థులు ఆలోచన, సృజనాత్మక నైపుణ్యాల సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డి.ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ దేశంలోనే నూతన విద్యా విధానాన్ని అమలు చేయడంలో ఏపీ అగ్రస్థానంలో నిలిచిందన్నారు. వైఎస్సార్ ఫౌండేషన్ పాఠశాలను ఏర్పాటు చేసి వాటితో అంగన్‌వాడీ కేంద్రాలను మిళితం చేయడంతో పునాది విద్యను బలోపేతం చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉపాధ్యాయులు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చాలని కోరారు. ప్రథమ్ సంస్థ సెంట్రల్ కంటెంట్ హెడ్ లీల పద్మలత, స్టేట్ కంటెంట్ హెడ్ సురేష్, నేషనల్ పవర్ ప్రోగ్రామ్ డైరెక్టర్ సునీతా, ఆంధ్ర మహిళా సభ నిర్వాహకురాలు కమల, స్టేట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ విజయ భాస్కర్, కార్యక్రమ కో ఆర్డినేటర్ రమామణి, కేఆర్పీలు(కీ రిసోర్సు పర్సన్లు), డైట్ అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ శిక్షణ 1, 2వ తరగతి చదువుతున్న 34 వేల మంది విద్యార్థులు, 55 వేల మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు ఉపకరించనుంది.

యనమలకుదురులో దాడి కేసు నమోదు

పెనమలూరు: యనమలకుదురులో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేసిన ఘటనపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు వినాయక్‌నగర్‌లో రోడ్డులో జరుగుతున్న పైప్‌లైన్ పనులకు వాహనాలు అడ్డుగా ఉన్నాయని అబ్దుల్ కరీం వాహనాలు తీస్తుండగా స్థానికుడు కుమార్ గొడవకు దిగాడు. అంతటితో ఆగకుండా రాళ్లతో కరీంపై దాడి చేసి గాయపరిచాడు. ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

పాతకక్షలతో వ్యక్తిపై దాడి

పెనమలూరు: పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై మరొకరు దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామవరప్పాడుకు చెందిన నూరుకుర్తి శ్రీను కానూరు ఆటోనగర్‌లో క్రషర్ పాయింట్ నిర్వహిస్తుంటాడు. అతనికి కానూరు మురళీనగర్‌లో ఉంటున్న మొహిద్దీన్‌కు గతంలో పాతకక్షలు ఉన్నాయి. శ్రీను యనమలకుదురు కృష్ణానది వద్దకు మిత్రులతో వెళుతుండగా అక్కడ ఎదురుపడిన మొహిద్దీన్ శ్రీనుపై దాడి చేశాడు. దాడిలో గాయపడిన శ్రీను ఇచ్చిన ఫిర్యాదుతో పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇనుప సామగ్రి చోరీ

కంకిపాడు: ఇనుప సామగ్రి చోరీ ఘటనపై కంకిపాడు పోలీసుస్టేషన్‌లో గురువారం రాత్రి కేసు నమోదైంది. ఎస్‌ఐ కె.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కోలవెన్నులోని జేసీ స్టేషనరీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫిబ్రవరి 5న ఇనుప గడ్డర్లు, రేకులు, రాడ్లు, ఇనుప సామగ్రి నిల్వ చేశారు. ఈ నెల 24న వాటిని పరిశీలించగా సామగ్రి కనిపించ లేదు.

సుమారు 10 టన్నుల ఇనుప సామగ్రి చోరీకి గురైనట్లు గుర్తించారు. కంపెనీ సివిల్ ఇన్‌చార్జి హనుమత్ కోటేశ్వరరావు కంకిపాడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కంపెనీలో విధులు నిర్వహిస్తున్న పలువురు సిబ్బందిపై అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.

అర్థం చేసుకుంటే గణితం సులువు



కంకిపాడు శాఖా గ్రంథాలయంలో యోగ శిక్షణ



ఉంగుటూరులో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కంకిపాడు: అర్థం చేసుకుంటే గణితం సులువేనని శిక్షకురాలు వై.మల్లిక సూచించారు. తెన్నేరు శాఖా గ్రంథాలయంలో గురువారం గణితంపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి ఎస్.సునీత శిక్షణను పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనం, యోగ శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు బి.మాణిక్యాలరావు చిన్నారులతో వ్యాయామం చేయించారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

ఉంగుటూరు: గ్రంథాలయాలను ప్రతి రోజూ సందర్శించడం వలన విజ్ఞానం లభిస్తుందని జయరామ విజ్ఞాన విహార హిందీ పండిట్ శివకుమారి అన్నారు. ఉంగుటూరు శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంప్ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు హిందీ మాట్లాడంలో మెలకువలు నేర్పించారు. అనంతరం పిల్లలకు నీతి కథలు, పుస్తక పఠనం, డ్యాన్స్, ఆటలు ఆడించారు. ఈ కార్యక్రమాన్ని లైబ్రేరియన్ స్వర్ణలత పర్యవేక్షించారు.

పెనమలూరు: వణుకూరు శాఖ గ్రంథాలయంలో గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు స్కిప్పింగ్, కోకో ఆటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులతో కథలు చెప్పించారు. జీకే చదివించారు. కార్యక్రమంలో వణుకూరు శాఖ గ్రంథాలయ అధికారి ఎం.చంద్రశేఖరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోటి శ్రీకృష్ణనామ జప యజ్ఞం



ఆహ్వాన పత్రిక ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కొవ్వూరు శ్రీరామానంద గౌడీయ మఠం ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి వారం రోజుల పాటు పాతబస్తీలోని మద్ది సుబ్బారావు ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ ప్రాంగణంలో కోటి శ్రీకృష్ణనామ జప యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ మఠం పీఠాధిపతి త్రిదండి స్వామి శ్రీ భక్తి విబుధ వామన మహారాజ్ చెప్పారు. ఈ సందర్భంగా హైస్కూల్ ప్రాంగణంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వశాంతి కోసం, లోకకల్యాణార్థం కోటి శ్రీకృష్ణ నామ యజ్ఞం, నామ జప యజ్ఞపూజ, సంకీర్తనోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సమాజంలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించటం ద్వారా శాంతిని వర్ధిల్లింపజేయటానికి తద్వారా మానవుల జీవితాలకు సార్థకత చేకూర్చడానికి యజ్ఞం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకూ ప్రతి రోజూ తెల్లవారుజాము నుంచి రాత్రి వరకూ పూజలు, భజనలు, ఉపన్యాసాలు జరుగుతాయన్నారు. ప్రధానంగా దేశం నలుమూలల నుంచి హరేరామ మార్గంలో పయనిస్తున్న పలువురు ప్రముఖులు కార్యక్రమాల్లో పాల్గొని ప్రసంగాలు చేస్తారని చెప్పారు. జూన్ ఒకటో తేదీన పూర్ణాహుతితో యజ్ఞం ముగిస్తుందన్నారు. శుక్రవారం సాయంత్రం జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గోవింద మహారాజ్, నిష్కించన మహారాజ్, వివేక బోధయన మహారాజ్, విష్ణు మహారాజ్, సుధిర దామోదర మహారాజ్, జనార్దన మహారాజ్, కృష్ణ బ్రహ్మచారి, కొలిపర మల్లి పాల్గొన్నారు.

సినీరంగ ప్రముఖుల మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న నిర్వాహకులు చిట్టిబాబు, డేవిడ్‌రాజు తదితరులు

విజయవాడకల్చరల్: తెలుగు కళావాహిని, కళా సంస్థల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్ కొత్తా పూర్ణానందం కళావేదికపై గురువారం సినీ నటుడు శరత్‌బాబు, సంగీత దర్శకుడు రాజ్ మృతికి సంతాపం వ్యక్తం చేశాయి. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ.. శరత్‌బాబు స్వయంకృషితో ఉన్నత శిఖరాలకు చేరుకున్న నటుడని ఆయన మృతి సినీ రంగానికి తీరని లోటని చెప్పారు, కళావేదిక కన్వీనర్ డేవిడ్‌రాజు మాట్లాడుతూ సంగీత దర్శకుడు రాజ్ ఎన్నో విజయవంతమైన చిత్రాలకు సంగీత దర్శకత్వం వహించారన్నారు. సంతాప సభలో బీవీ వీరభద్రరావు, దండు చంద్రశేఖర్, బీవీ రామ్మోహన్, ఆర్.చలపతిరావు పాల్గొన్నారు. శరత్‌బాబు, రాజ్ చిత్రపటాలకు నివాళులర్పించారు.

పచ్చిరొట్ట ఎరువులను సద్వినియోగం చేసుకోవాలి



పొలాల్లో పంపు మోటార్లను పరిశీలిస్తున్న మాధవీలత

రామవరప్పాడు: రైతు భరోసా కేంద్రాల్లో పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను రైతులు సద్వినియోగపరుచుకోవాలని డీడీఏ మాధవీలత అన్నారు. విజయవాడరూరల్ మండలం నున్న రైతు భరోసా కేంద్రంలో గురువారం జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో ఒక రోజు విత్తనం నుంచి విక్రయం వరకు శిక్షణ కార్యక్రమంతో పాటు మిషన్ లైఫ్‌పై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవీలత మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను పంట పుష్పించే దశలో భూమిలో కలియ దున్నటం వల్ల ప్రధాన పోషకమైన నత్రజనిని, సూక్ష్మపోషకాలను ఎక్కువ మోతాదులో అందివచ్చని తెలిపారు. అనంతరం మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగంగా క్షేత్ర సందర్శన చేశారు. ఈ సందర్భంగా మట్టి నమూనా సేకరణ విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏడీఏపీ మోనీషా, ఏఓ రంగనాథ్ బాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు బిందు, మౌనిక, ఉద్యానవన సహాయకులు శ్యామ్ పాల్ పాల్గొన్నారు.

న్యాయవాది రాజారావుకు అంతిమ వీడ్కోలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమాన్‌జంక్షన్‌కు చెందిన ప్రముఖ న్యాయవాది, నూజివీడు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు లింగంనేని రాజారావు అంతిమ యాత్ర గురువారం ఘనంగా జరిగింది. గత కొంత కాలంగా క్యాన్సర్‌తో బాధపడుతూ మృతి చెందిన ఆయనకు ఘనంగా తుది వీడ్కోలు పలికారు. లింగంనేని రాజారావు భౌతికకాయాన్ని జిల్లా అదనపు జడ్జి ఆకుల నాగ శైలజ, నూజివీడు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి హరిబాబు, స్పెషల్ మేజిస్ట్రేట్ కృష్ణామూర్తి, గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ దుట్టా రామచంద్రరావు, నూజివీడు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బసవరాజు రామకృష్ణ సందర్శించి నివాళి అర్పించారు. రాజారావు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలువురు న్యాయవాదులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, బ్యాంక్ సిబ్బంది, వ్యాపారులు రాజారావు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భారీ ఊరేగింపుతో రాజారావు అంతిమ యాత్ర జరిగింది. ఆయన స్వగ్రామమైన బాపులపాడు మండలం వీరవల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

స్వచ్ఛతకు డస్ట్‌బిన్ల పంపిణీ



రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ ప్రతినిధులతో అడిషనల్ కమిషనర్ సత్యవతి

పటమట(విజయవాడతూర్పు): మేరీ లైఫ్ మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత పఖ్వాడ – శుభ్రత కార్యక్రమంలో భాగంగా విజయవాడ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్‌ఆర్)లో భాగంగా 315 డస్ట్‌బిన్లను, కౌమారదశ ఆడపిల్లల పర్సనల్ హైజీన్‌కు సంబంధించి 500 ఐఈసీ మెటీరియల్‌ను వీఎంసీ అడిషనల్ కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.వి.సత్యవతికి అందించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఏసీ చాంబర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ తరపున డస్ట్‌బిన్లను అందించటం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో సోలార్ ఎనర్జీకి సంబంధించిన వ్యవహారంలో తమ సహకారం ఉంటుందని ఆ సంస్థ పేర్కొనటం హర్షణీయమని చెప్పారు. భవిష్యత్తులో కూడా వివిధ కార్యక్రమాల ద్వారా విజయవాడ నగర అభివృద్ధికి సంస్థ తోడ్పడాలని కోరారు. రూరల్ ఎలక్ట్రిఫికేషన్ కార్పొరేషన్ చీఫ్ ప్రోగ్రామ్ మేనేజర్ ఎస్.జయంతి, డెప్యూటీ మేనేజర్ కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.